# పార్టీలకతీతంగా నగరాభివృద్ధికి కృషి



మేయర్ కొలగాని శ్రీనివాస్

2 లో

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శనివారం | 17 అక్టోబరు, 2026 | పేజీలు : 08

# అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

### ఆడబిడ్డల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ పండుగ. వేములవాడ ప్రజలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు

**ప్రజా పక్షం/వేములవాడ:** వేములవాడ పట్టణంలో అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ పండగ సంబరాలు. మూలవాగు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు. వేములవాడలో సద్దుల బతుకమ్మ పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఆధ్యాత్మిక శోభతో ప్రారంభమయ్యాయి. స్థానిక పురపాలక సంఘ పాలకవర్గం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ దేవి అమ్మవారి విగ్రహాన్ని శోభాయాత్రగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమై ఊరేగింపు పట్టణ ప్రధాన పురవీధుల గుండా సాగుతూ మూలవాగు బతుకమ్మ తెప్ప వరకు వేడుకగా కొనసాగింది. ఈ ఊరేగింపు కార్యక్రమానికి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఊరేగింపు వాహనాన్ని ఆయనే స్వయంగా నడిపి మూలవాగు బతుకమ్మ తెప్ప వరకు తీసుకెళ్లడం శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాప్రతినిధి స్వయంగా వాహనాన్ని నడుపుతూ ముందు కెళ్లడంతో స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ జయజయధ్వానాలు చేశారు. శోభాయాత్ర పొడవునా మంగళవాయిద్యాలు, సాంప్రదాయ డప్పు చప్పుళ్లు, కోలాటాలు, భక్తి సంకీర్తనల నడుమ పట్టణ వీధులన్నీ ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించిపోయాయి. అనంతరం



సాంప్రదాయ పద్ధతిలో మూలవాగు వద్ద అమ్మవారిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన తెలంగాణ గడ్డపై బతుకమ్మ పండుగ ఆడబిడ్డలందరికీ అత్యంత ప్రీతి పాత్రమైనదని తెలిపారు. వేములవాడ పట్టణ మహిళా సోదరీమణులకు, ప్రజలకు ఆయన సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు సద్దుల బతుకమ్మ పండుగ నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలు, పట్టణాల్లో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు జరుపుకుంటే, ఒక్క వేములవాడ పట్టణంలో మాత్రం సుదీర్ఘకాలంగా వస్తున్న ఆచారం ప్రకారం ప్రత్యేకంగా ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ జరుపుకోవడం ఇక్కడి సంస్కృతిలోని విశిష్టత అని వివరించారు. ఏడో రోజే సద్దుల బతుకమ్మ ఇక్కడ జరగడం వల్ల స్థానిక మహిళలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని, వారు తమ పుట్టినింట మరియు మెట్టినింట కూడా ఎంతో సంతోషంగా, ఒత్తిడి లేకుండా పండుగను జరుపుకునే వీలు కలుగుతోందని అన్నారు. ప్రకృతి సిద్ధమైన పూలను బతుకమ్మగా పేర్చి, జగన్మాతను ఆరాధించే అత్యుత్తమ సాంప్రదాయం మన తెలంగాణ ప్రజల సొంతమని పేర్కొన్నారు. బతుకమ్మను సాక్షాత్తు గౌరమ్మ ప్రతిరూపంగా భావించి పూజించడం తరతరాలుగా వస్తున్న సనాతన ఆచారమని గుర్తుచేశారు. మహిళలందరూ ఆనందోత్సాహాల నడుమ పండగ జరుపుకోవాలని కోరారు. సాయంత్రం వేళల్లో జరిగే బతుకమ్మల నిమజ్జన కార్యక్రమానికి వచ్చే వేలాది మంది మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ తరఫున మూలవాగు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విద్యుత్ దీపాల అలంకరణ, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, భద్రత పరంగా అధికారులు అన్ని చర్యలు పూర్తి చేశారని తెలిపారు. ఈ శోభాయాత్ర మరియు అమ్మవారి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజులతో పాటు మున్సిపల్ కమిషనర్ లోకేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ప్రముఖ నాయకులు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్, గౌరవ పాలకవర్గ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీ ల నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని (ఎంసిహెచ్) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఐసియు, చిన్నారుల విభాగం, పడకలు, ఏసిల పనితీరు, రిజిస్టర్లు, పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన చికిత్స అందించాలని వైద్యాధికారులకు సూచించారు. చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న సేవలపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల్లో ఉండాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, అదనపు వసతులపై ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. మరమ్మతులు ఏవైనా ఉంటే తక్షణమే పూర్తి చేయించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం తాగి వచ్చి గొడవలు చేసే వారిపై నిఘా ఉంచాలని, అలాంటి ఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, ఆర్ఎంఒ డాక్టర్ శ్రీధర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ కుమార్ దీపక్

# పకడ్బందీగా జనగణన ప్రక్రియ

### అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రానున్న రెండో విడత జనగణన ప్రక్రియను పకడ్బందీగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత సిబ్బందికి సూచించారు. జనగణనలో భాగంగా ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడత జనగణనకు సంబంధించి వర్క్స్ అండ్ టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రారంభం కానున్న జనగణన ప్రక్రియలో భాగంగా,ఇప్పటికే గృహాల జాబితా తయారీ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి చేపట్టనున్న జనాభా గణనకు సంబంధించి సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు కీలకమైనదని తెలిపారు. జనాభా గణనలో సేకరించే వివరాలు ఖచ్చితంగా ఉండేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన గృహాల జాబితా ప్రక్రియను ఆధారంగా చేసుకుని, కేటాయించిన ప్రాంతా





ల్లోని ప్రతి కుటుంబాన్ని గుర్తించి జనాభా గణన చేపట్టాలని తెలిపారు. ఎవరూ గణన నుంచిమినహాయించబడకుండా ప్రతి ఇంటిని సందర్శించి, కుటుంబ సభ్యుల వివరాలను నిర్దేశిత ప్రశ్నావళి, అధికారిక మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలని సూచించారు.జనగణనలో భాగంగా ప్రజల నుంచి సేకరించే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, ఊహాజనిత సమాచారానికి తావివ్వకూడదని తెలిపారు.వివరాల నమోదు సమయంలో సందేహాలు తలెత్తితే సంబంధిత అధికారుల సూచనలు తీసుకోవాలని, సాంకేతిక పరికరాలు లేదా డిజిటల్ వ్యవస్థలను వినియోగించే సందర్భంలో శిక్షణలో సూచించిన విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు.ప్రజల నుంచి సేకరించిన వ్యక్తిగత వివరాల గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని, సమాచారాన్ని అనధికార వ్యక్తులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. జనగణనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారు సహకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనగణన విధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలు, నిబంధనలు, నిర్ణీత గడువులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, అప్పగించిన విధులను సమన్వయంతో నిర్వహించి జనగణన ప్రక్రియ విజయవంతమయ్యేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ,సి సెక్షన్ పర్యవేక్షకులు కోటేశ్వర్ , సెన్సెస్ ట్రైనర్ వర్షిత, సంబంధిత అధికారులు, వర్క్స్ అండ్ టెక్నికల్ అసిస్టెంట్లు,తదితరులు పాల్గొన్నారు.

# జెబిఎమ్ పెద్దపల్లి జిల్లా ఛైర్మన్‌గా రాజేశం

ప్రజాపక్షం/అంతర్గాం : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలోని జవహర్ బాల్ మంచ్ (జెబిఎమ్) తెలంగాణ రాష్ట్ర పెద్దపల్లి జిల్లా ప్రొవిజనరీ ఛైర్మన్‌గా టిటిఎస్ అంతర్గాం గ్రామానికి చెందిన యువ నాయకుడు ఆల కుంట రాజేశంను నియమిస్తూ రాష్ట్ర ఛైర్మన్ మామిడి రిషికేశ్ రెడ్డి అధికారిక ఉత్తర్వులు గురువారం జారీ చేశారు. జాతీయ కోఆర్డినేటర్ ఆమోదంతో ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. రాజేశంకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన ఛైర్మన్ రిషికేశ్ రెడ్డి, బాల్యాంగ పరిరక్షణ,జవహర్ బాల్ మంచ్, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

# సింగరేణి అభివృద్ధిపై అమ్మవారి దీవెనలు ఉండాలి

ఏఐటియుసి ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను



ప్రజాపక్షం/పెద్దపల్లి : దేవీ నవరాత్రుల సందర్భంగా శుక్రవారం సింగరేణి ఆర్జీ1 ఏరియాలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో సరస్వతీ మాత రూపంలో ఉన్న అమ్మవారిని ఏఐటీయూసీ నాయకులు దర్శించుకున్నారు.సింగరేణి అభివృద్ధి కోసం అమ్మవారి దీవెనలు ఉండాలని కోరుకుంటూ, సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కార్మికులకు,ఉద్యోగులకు,వారి కుటుంబ సభ్యులకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.సివిల్ డిపార్ట్‌మెంట్ కార్మికులు వారి కుటుంబాలు సుఖసంతోషాలతో,భోగభాగ్యాలతో ఉండాలని, వారి కుటుంబాలు ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించేలా అమ్మవారి దీవెనలు,ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్,బ్రాంచి ఉపాధ్యక్షులు బోగ సతీష్ బాబు, రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు బిట్ల వెంకటేశ్వర్లు,నాయకులు బొల్లి శ్రీనివాస్, ఏ.వి.ఎస్. ప్రకాశ్,దోరగండ్ల మల్లయ్య,వీరేశం, బిక్షపతి, మహేష్,రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంపల్లి గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా శుక్రవారం గ్రామంలోని యూత్ లీడర్స్ ఆధ్వర్యంలో దుర్గామాత మండపంలో మహాచండీ హోమం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ గీతారాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దొడ్డ బాలాజీ దంపతులు మాట్లాడుతూ మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. రైతాంగానికి పంటలు విరివిగా పండి,ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు నిండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భవానీ దీక్షాపరులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,గ్రామస్తులు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'ఎల్‌నినో' ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రణాళిక ఏదీ?

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ప్రజాపక్షం/కరీంనగర్ : ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందంటూ రైతులను ఆందోళనకు గురి చేయడం కాకుండా విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళికను వెల్లడించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. యాసంగి పంటలు వేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు చెప్పడం ఏంటని విమర్శించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించాలి

తెలంగాణలో ప్రాణహిత, గోదావరి వంటి నదులు ఉన్నప్పటికీ సాగునీటి సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయని రవిశంకర్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు అవసరమైన మరమ్మత్తులు చేపట్టి సాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.24 గంటల విద్యుత్, మూడు పంటలకు రైతు భరోసా, ఎకరానికి రూ.15 వేల సాయం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కేంద్రాల నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని, బొగ్గు సరఫరా, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయడంతోపాటు సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున సబ్ స్టేషన్ల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సుంకె రవిశంకర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, శాతవాహన విశ్వవిద్యాలయం బిఆర్‌ఎస్‌వి ఇంఛార్జి చుక్కా శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండువగా సద్దుల బతుకమ్మ వేడుకలు





ప్రజా పక్షం/వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో ఆడపడుచులు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేములవాడ పురవీధుల గుండా బతుకమ్మలతో మహిళలు ఊరేగింపుగా బతుకమ్మ ఘాట్ వద్దకు చేరుకోవడంతో పట్టణ వీధులన్నీ బతుకమ్మ ఆటపాటలతో మారుమోగుతున్నాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సంబరాలను పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటున్నారు. బతుకమ్మ ఘాట్ వద్ద మహిళలంతా ఒకచోట చేరి వలయంగా తిరిగి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. అనంతరం మూలవాగు నీటిలో బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసి, వాయనాలు ఇచ్చి పుచ్చుకోవడంతో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

# అమ్మవారి ఆశీస్సులతో సింగరేణికి మంచి జరగాలి

ఏఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లు



ప్రజాపక్షం/పెద్దపల్లి : దుర్గామాత ఆశీస్సుల వల్ల సింగరేణి సంస్థకు మంచి లాభాలు వచ్చి,కార్మికులకు అంతా మంచే జరగాలని, అమ్మవారి ఆశీస్సులు సింగరేణి పై ఉండాలని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు అన్నారు. శుక్రవారం రోజునవరాత్రి ఉత్సవాలలో భాగంగా సింగరేణి ఆర్జీ1 ఏరియాలోని ఓసీపీ5 లో కొలువుదీరిన అమ్మవారిని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ అనిల్ గబాలే, ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ అమ్మ వారి కండువాలు కప్పి స్వాగతం పలికారు.అనంతరం వారు ఓసీపీ5 లో సరస్వతీ రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని, కార్మికులకు,అధికారులకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.నవరాత్రుల సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో సింగరేణి వ్యాప్తంగా గనులపై దుర్గాదేవి అమ్మవార్లకు పూజలు చేస్తున్న కార్మికులు,ఉద్యోగులు,అధికారులు,వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి దీవెనలతో సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్ వెంకట్ రెడ్డి,బి.శ్యాంసన్,సయ్యద్ సోహేల్, గండి ప్రసాద్, చందా తిరుపతి, రాజిరెడ్డి, ఎం.ఎ. గౌస్,భక్తి శ్రీనివాస్, జి.విజయ్ కుమార్,ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, పాల్గొన్నారు.

# ఘనంగా 2004–2005 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/సుల్తానాబాద్/ఎలిగేడు : ఎలిగేడు మండల కేంద్రంలో 2004–2005 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయంగా పలకరించుకున్నారు.ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహాలు,తరగతి గదిలో జరిగిన అల్లరి,ఉపాధ్యాయుల బోధనలు,పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను నెమరువేసుకుంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత అనుబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ హాజరై పూర్వ విద్యార్థులను అభినందించారు.

# లక్కీడ్రా ద్వారా లైసెన్స్ కేటాయింపు

కలెక్టర్ ఇలా త్రిపాఠి




ప్రజాపక్షం/నిజామాబాద్ : బోధన్ పట్టణానికి నూతనంగా మంజూరైన మద్యం బార్‌కు లాటరీ ద్వారా లైసెన్స్ జారీ కోసం శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఈ ప్రక్రియ కొనసాగింది. బార్ లైసెన్స్ కోసం మొత్తం 19 దరఖాస్తులు దాఖలయ్యాయి. దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ లక్కీడ్రా తీసి బార్ కేటాయింపు కోసం లైసెన్స్ ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్లను అందరికి చూపిస్తూ పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, బోధన్ ఎక్సైజ్ సిఐ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా నగరాభివృద్ధికి కృషి

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : సద్దుల బతుకమ్మ, దుర్గామాత నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించుకునేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి నగరంలోని బతుకమ్మ నిమజ్జన పాయింట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లైటింగ్, సౌండ్ సిస్టం, బారికేడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, గజ ఈతగాళ్ల ఏర్పాటు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 21న జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి మానకొండూర్, కొత్తపల్లి చెరువులను ఎంపిక చేసి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 38 డివిజన్‌లోని అమీర్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ స్థానిక కార్పొరేటర్ దేవసాని సరస్వతి సత్యనారాయణతో కలిసి రూ.24 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. పార్టీలకు అతీతంగా నగరంలోని అన్ని డివిజన్‌ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని యూఐడీఎఫ్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్ల నిధులు తీసుకొచ్చామని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆకుల నరసయ్య, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాల ఏర్పాటు



ప్రజాపక్షం /ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లె గ్రామంలో బతుకమ్మ ఘాటు,వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ,విద్యుత్ స్తంభాలను శుక్రవారం సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచ్ మెంగని శ్రీనివాస్,తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయ బతుకమ్మ వేడుకలను, గ్రామంలో ఆడపడుచులు విద్యుత్తు వెలుగులలో బతుకమ్మ, ఆడుకోవడానికి ప్రారంభించామని తెలిపారు. ఉప సర్పంచ్ పల్లె ఆనంద్ , వసడిమేల మల్లేశం, స్వప్న, కార్యదర్శి రాజు, కారోబార్ రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జి.ఎం కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు

ప్రజాపక్షం/రామగిరి : బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని శుక్రవారం నాడు రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జి.ఎం.కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ ఆటపాట కార్యక్రమంలో వివిధ విభాగాల మహిళా అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలను దేవతలుగా పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలందరూ ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ అన్నారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా తెలియజేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆర్.జి3 ఏరియా ఇంచార్జ్ సేవా అధ్యక్షురాలు శ్రీమతి వెంకటలక్ష్మి నాగేశ్వరరావు బతుకమ్మ ఆటపాటలో పాల్గొని మహిళా ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 06:00 గంటలకు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.కార్యక్రమంలో ఎస్టోటుజిఎం బండి సత్య నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఐ ఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ,ఏరియా సెక్యూరిటీ అధికారి కోల శ్రీనివాస్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల నిర్వహణపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ సోమవారం జరగనున్న దసరా ఉత్సవాల నిర్వహణపై స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు,భద్రతా చర్యలు,ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.ముఖ్యంగా సింగరేణి కార్మికులు,కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలతో పాటు రామగుండం నియోజకవర్గంలోని ప్రతి మహిళకు ఉత్సవాల ఆహ్వానం అందించాలని అధికారులకు సూచించారు.ప్రతి కుటుంబం ఉత్సవాల్లో భాగస్వాములయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి,సినీ నటుడు శివారెడ్డి,మున్సిపల్,సింగరేణి, పోలీస్ అధికారులు,కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికులకు కెటిఆర్ క్షమాపణ చెప్పాలి

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




ప్రజాపక్షం/గోదావరిఖని : సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపై స్పందించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఒకప్పుడు సింగరేణి కార్మికుల హక్కులు, తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడిన నాయకులు అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. కేటీఆర్ రామగుండం పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తీవ్రంగా ఖండించారు.కార్మికుల త్యాగాలను, వారి కుటుంబాల బాధలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని రాజ్ ఠాకూర్ అన్నారు. ఉద్యమకారుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి త్యాగాలను గుర్తించి,వారికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య,సీనియర్ నాయకులు,కార్పోరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# దుర్గామాత దయవల్ల ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### ప్రభుత్వ విప్ విజయరమణారావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : దుర్గామాత కటాక్షంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆకాంక్షించారు.శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆరవ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ ఆయనకు తోడుగా ఉన్నారు.ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ,దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,సాంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని కోరుకున్నారు.అనంతరం ఆరవ వార్డు మహిళలు తమ ప్రాంత సమస్యలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్‌కు సూచించారు.దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నేత దుగ్యాల సంతోష్‌రావు, రాకేష్‌రెడ్డి, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఉట్ల వరప్రదీప్,తొగరి కొండ ప్రభాకర్,మాజీ వార్డు సభ్యులు అమిరిశెట్టి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు గాదాసు రవీందర్,బీజేపీ నేత కందునూరి కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు న్యాతరి శ్యాంసుందర్, మామిడిపల్లి శ్రీకాంత్,న్యాతరి దేవేందర్ కుమార్,ఆరేపల్లి కిరణ్,ఆరేపల్లి హేమన్‌రాజు,న్యాతరి దుర్గయ్య,నిర్వాహకులు ఆరేపల్లి రాకేష్, లలితతో పాటు ఆరవ వార్డు మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 25—26 తేదీల్లో మహా ధర్నాను జయప్రదం చేయండి

### సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు




ప్రజాపక్షం/సుల్తానాబాద్ : హైదరాబాద్‌లో అక్టోబర్ 25,26 తేదీల్లో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. మహా ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం సుల్తానాబాద్‌లో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలోని వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ రెండు రోజుల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని వివిధ రంగాల కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అక్టోబర్ 25న ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, అక్టోబర్ 26న రాష్ట్రవ్యాప్త యూనియన్లు,స్కీమ్ వర్కర్లు,స్థానిక సంస్థల కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు భారీ సంఖ్యలో హాజరై మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎరవెల్లి ముత్యంరావు విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య,సుల్తానాబాద్ మండల నాయకులు మాతంగి రాజమల్లు, రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నౌండ్ల బ్రహ్మచారి,లారీ డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జంగ తిరుపతిరెడ్డి, రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం గౌరవ సలహాదారులు బండారి స్వామి,సంఘం ఉపాధ్యక్షులు శేర్ రవీందర్, వీరగోని కిరణ్,లారీ డ్రైవర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు మాతంగి శంకర్,హరిదాస్,పాల్గొన్నారు.

## ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులను ప్రోత్సాహిస్తూ ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేయనున్నట్లు 1981 ఎస్ఎస్సీ మిత్రబృందం కన్వీనర్ జక్కు రవీందర్ తెలిపారు. గత 23 సంవత్సరాలుగా పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమ బృందం ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా గోదావరి తీరంలోని రామాలయం ఎదుట బతుకమ్మల స్వాగత వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ధర్మపురి మున్సిపల్ పరిధిలోని పదిహేను వార్డుల్లో బతుకమ్మలు పేర్చుకొని వచ్చే మహిళా బృందాల్లో ప్రతి గ్రూపునకు ఒక ఉత్తమ బతుకమ్మను ఎంపిక చేసి బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు సంప్రదాయబద్ధంగా పేర్చిన బతుకమ్మలకు బహుమతులు ప్రదానం చేస్తామని వెల్లడించారు.ధర్మపురి మహిళలను ప్రోత్సహించడం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి బతుకమ్మకు గౌరవ పూర్వకంగా స్వాగతం పలకడంతోపాటు మహిళలను సత్కరించేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నాయకపోడు సేవా సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సందరెల్లి సమ్మక్కసారలమ్మ దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం నాయకపోడు సేవా సంఘం మండల కమిటీ ఎన్నికలను ఘనంగా నిర్వహించారు.మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నాయకుడు సేవా సంఘం ముత్తారం మండలం అధ్యక్షులుగా సంకుర్తల ప్రకాష్,ప్రధాన కార్యదర్శిగా పోలం చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా గుర్రం కిష్టయ్య, ఉపాధ్యక్షులుగా పెద్ది రాజసమ్మయ్య,భీమిని గట్టయ్య,సంయుక్త కార్యదర్శులుగా పర్ష ఓదెలు, పెద్ది లక్ష్మీ రాజ్యం, కార్యనిర్వాహక అధ్యక్షులుగా గుర్రం శ్రీకాంత్, కోశాధికారిగా ముసలి అశోక్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ముఖ్య అతిథులు ప్రకటించారు.నాయకపోడి సేవా సంఘం కులబాంధవులు, యువకులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

# సరస్వతి అలంకరణలో భక్తులకు అమ్మవారి దర్శనం



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : దుర్గా నవరాత్రుల సందర్భంగా సుల్తానాబాద్ మండలంలోని పూసల భక్త మార్కండేయదేవాలయంలో ఆరవ రోజు అమ్మవారు సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారిని హంస, వీణా వాహనాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులతో ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిత్య పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని దేవాలయ చైర్మన్ వలస నీలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వలస భాస్కర్, పేద కిషన్, ఉడ్డాల రమేష్, బీకాం శంకరయ్య, నాల్లా వెంకన్న, కండక్టర్ శంకరయ్య, అడిగొప్పుల లింగమూర్తి, మహిళా భక్తులు,పూసల గ్రామ ప్రజలు,సుల్తానాబాద్ ప్రాంతానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ,దుర్గామాత కృపతో ప్రతి భక్తుని కుటుంబంలో సుఖశాంతులు,అష్టైశ్వర్యాలు,ఆయురారోగ్యాలు,ధనధాన్య సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు.

# హనుమాన్ రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాపక్షం/గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పెంద్రు హనుమాన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు.శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ గోలివాడలోని హనుమాన్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పెంద్రు హనుమాన్ రెడ్డి మృతికి సంతాపం తెలియజేసి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగం కిరణ్ కుమార్ గౌడ్,డిసిసి ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్య గౌడ్, మాజీ ఎంపీపీ ఊరిమెట్ల రాజలింగం, జెబీఎం పెద్దపల్లి జిల్లా చైర్మన్ ఆలకుంట రాజేశం,తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం నగరంలో విస్తృతంగా పర్యటించారు. రామగుండం–లింగాపూర్ రహదారి నిర్మాణ పనులు, రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు,నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్వహణ, 36వ డివిజన్‌లో జరుగుతున్న జీవో నం.76 దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శారదానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను,మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు.రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో,శారదానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.మహిళా సమాఖ్యల ద్వారా విద్యుత్తు ఉత్పత్తిమంథని మండలం చిల్లపల్లి గ్రామంలో గౌతమి మహిళా సమాఖ్య, రామగిరి మహిళా సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ప్రస్తుతం ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, రోజుకు 6,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు.అయితే ప్రత్యేక విద్యుత్ లైన్ అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం రోజుకు సుమారు 4,500 యూనిట్ల విద్యుత్‌ను గుంజపడుగు సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక విద్యుత్ లైన్



ఏర్పాటుకు సుమారు రూ.28 లక్షల అంచనా వ్యయం అవసరమవుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుతో సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.టిజిఎంఎస్ఐడిసి అధికారి విశ్వప్రసాద్,టిజిఇడబ్ల్యూఐడిసి ఏఈ రమేష్, ఈఈ రామకృష్ణ, అదనపు డీఆర్డీఏ అధికారి రవీందర్,డీఈ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు,పాల్గొన్నారు.

## ఘనంగా కుంకుమ పూజలు ,అన్నదానం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘవ పట్నం,చిల్వాకోడూర్ గ్రామంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.రాఘవపట్నం గ్రామంలో అమ్మ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తుల కోలాహలం నెలకొంది.ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు.తమ కుటుంబాలకు సుఖశాంతులు,ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు చేకూరాలని మహిళలు అమ్మవారిని వేడుకున్నారు .విశేషంగా ఆకట్టుకున్న కూరగాయల అలంకరణ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అత్యంత సుందరంగా అలంకరించారు.ఈ వినూత్న అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం అలంకరణకు ఉపయోగించిన కూరగాయలతో రుచికరమైన వంటకాలు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.అమ్మ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో దుర్గామాతను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .అమ్మవారికి సమర్పించిన కూరగాయల ప్రసాదాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.ఈ కార్యక్రమంలో భవాని దీక్షాపరులు,అమ్మ భవాని సేవా సమితి సభ్యులు,రాఘవ పట్నం ,గంగిదేవిపల్లె గ్రామ ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సాగునీటి ప్రవాహాన్ని పునరుద్ధరించిన బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి ప్రాంతంలోని డి 83 పరిధిలో గల మైనర్ 20R కాలువలో ఎగువ ఆయకట్టు రైతులు తమ పొలాలకు సాగునీరు మళ్లించుకునేందుకు కాలువ కల్వర్టును రేకులు, గడ్డి, బండరాళ్లతో మూసివేయడంతో దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు నిలిచిపోయింది.నీటి ప్రవాహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన వస్తువులు కొట్టుకుపోకుండా కాలువ గేటును సగం వరకే ఎత్తడంతో దిగువ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో రైతులు బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ఎగువ రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా కాలువలోకి దిగి కల్వర్టుకు అడ్డుగా ఉన్న రేకులు, గడ్డి తదితర వస్తువులను తొలగించి దిగువ ఆయకట్టుకు నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు.ఈ సందర్భంగా ఉప్పు రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎగువ రైతు పంట బతకాలని, దిగువ రైతు పంట బతకాలని ప్రతి పొలానికి సాగునీరు అందాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో సాగునీటిని అందించాలని కోరారు. గోదావరిలో పుష్కలంగా నీరు ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపి ఉంటే నేడు రైతులకు ఈ కష్టాలు వచ్చేవి కావని



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం జలాలను వినియోగించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సాగునీటి నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి డి83 పరిధిలోని మైనర్ 20R కాలువతో పాటు అన్ని కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు గంగుల సతీష్, కుమ్మరి మల్లేశం,బొగ్గుల మోహన్,షేర్ రాజయ్య,తుమ్మల శ్రీనివాస్,బండి రాజేశం,పెరక శంకర్,శిరవేణి కనకయ్య,బట్టు అంజి, బద్దిపల్లి నర్సయ్య,బుజ్జయ్య,సొల్లూరి రవి,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌కు జిపి సిబ్బంది సొంత వాహన సదుపాయమా..?

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :**పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో క్షేత్రస్థాయి పరిశీలనల నిర్వహణపై జగిత్యాల మండలంలో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెరిఫికేషన్ కోసం గ్రామాల్లో పర్యటించే ఓ హౌసింగ్ అధికారికి గ్రామ పంచాయతీ సిబ్బందే డ్రాపింగ్, పికప్ సదుపాయం కల్పిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఐదు గ్రామాలే ఉన్నా.. ఇదేనా విధానం..? జగిత్యాల అర్బన్ మండల పరిధిలో ఐదు గ్రామాలు మాత్రమే ఉండటంతో, ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు సంబంధిత ఓ హౌసింగ్ అధికారి పర్యటించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం ఎంత ముఖ్యమో, ఆ పర్యటనలు నిబంధనలకు అనుగుణంగా జరగడం కూడా అంతే ముఖ్యం. ఆ పర్యటనల సమయంలో అధికారిని గ్రామానికి తీసుకెళ్లడం, తిరిగి తీసుకురావడం వంటి బాధ్యతలను ఆయా గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్నారనే ప్రచారం జగిత్యాల అర్బన్ మండలంలో జరుగుతోంది. పంచాయతీ సిబ్బందిపై అదనపు బాధ్యతల భారం..? ఇప్పటికే పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామ పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివిధ పనులతో నిత్యం బిజీగా ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇతర శాఖల అధికారుల రాకపోకల కోసం కూడా వారే వాహన సదుపాయం కల్పించాల్సి వస్తే, అది వారి విధుల్లో భాగమా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.అధికారుల పర్యటనల సమయంలో పంచాయతీ సిబ్బంది సొంత వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లయితే సంబంధిత ఆ హౌసింగ్ అధికారిపై జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## రైతులకు, వ్యవసాయ రంగానికి ట్రాక్టర్ ఎంతో ఉపయోగం ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం లోని రేకులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ అశోక్ నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్ ప్రారంభించారు.నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. రైతు వ్యవసాయ పనులకు నూతన ట్రాక్టర్ ఎంతగానో ఉపయోగపడాలని ఆకాంక్షించారు. కేడిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రాంచందర్ రావు,మండల పార్టీ అధ్యక్షులు రమేష్,శ్రీనివాస్ రావు,అనిల్ సర్పంచ్ సుషీన్, కౌన్సిలర్ చాంద్ పాషా లక్ష్మీ ,రాజం,జుంబర్తి శంకర్, పవన్, పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారికి బోనాల సమర్పణ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని రత్నాపూర్ గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవి అమ్మవారు భక్తుల నుండి ప్రత్యేక పూజలు అందుకుంటూ దర్శనమిస్తున్నారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకొని ఆరవ రోజు గ్రామ సర్పంచ్ గొండ రాజేందర్, మహిళలతో కలిసి బోనమెత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. అదేవిధంగా కుస్తాపూర్ గ్రామంలో సైతం మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక నైవేద్యాలను వండుకొని బోనాలతో ఊరేగింపు చేపట్టి అమ్మవారికి సమర్పించి పూజలు జరిపించారు.ఈ కార్యక్రమాలలో రత్నాపూర్ గ్రామ సర్పంచ్ గొండ రాజేందర్, ఇరు గ్రామాల దుర్గాదేవి కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు మహిళా భక్తురాలు పాల్గొన్నారు.

**మల్లాపూర్ :** మల్లాపూర్ మండల కేంద్రంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వెలుమ కార్పోరేషన్ చైర్మన్ జువ్వడి నర్సింగారావుకు శ్రీ నవదుర్గ సేవాసమితి, కనకదుర్గ సేవా సమితి సభ్యులు వేరువేరుగా ఆహ్వాన పత్రికను అందజేశారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించి శాలువాతో సత్కరించారు. పాల్గొన్న వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సోమయ్య,నాయకులు రవీందర్,ఆనంద్ గౌడ్,నవదుర్గ సేవాసమితి సభ్యులు సతీష్ రంజిత్ లక్ష్మ ణ్,కనకదుర్గ సేవా సమితి సభ్యులు రవీందర్,మారుతి రాజయ్య చారి,శేఖర్,రామకృష్ణ,సంతోష్ రాజకుమార్,ఉన్నారు.

## రాఘవపేటను ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్లాస్టిక్ రహిత గ్రామంగా రాఘవపేట గ్రామాన్ని తీర్చిదిద్దాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, వెలుమా కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు అన్నారు.ఈ మేరకు శుక్రవారం రాఘవపేట గ్రామంలో నెలకొల్పిన దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకునీ ప్రత్యేక పూజలు జరిపించారు.రాఘవపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు నత్తి శేఖర్ నత్తి రాము లక్ష్మ ణ్ ల తండ్రి నత్తి లక్ష్మీ రాజం జ్ఞాపకార్థం దుర్గాదేవి సమితికి 8 వందల స్టీల్ ప్లేట్లను విరాళంగా అందజేయగా నర్సింగ్ రావు చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాము,లక్ష్మ ణ్ ,శేఖర్, తదితరులున్నారు.

## అమ్మక్కపేటలో డ్రైనేజీ సమస్యకు ఎండిఓ సూచనలు

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామంలో రెండు ఇళ్ల మధ్య నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఎంపీఓ రామకృష్ణ రాజు శుక్రవారం పరిశీలించి,సమస్య పరిష్కారానికి తగిన సూచనలు చేశారు.సర్పంచ్ భాస్కర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

## కాత్యాయని రూపంలో అమ్మవారు దర్శనం

600మంది మహిళలతోసామూహిక కుంకుమార్చన

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలోని నూతన టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రయోదశ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరవ రోజు అమ్మవారిని కాత్యాయని రూపంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.ఉదయం సరస్వతి రూపంలో, సాయంత్రం అర్ధనారీశ్వర రూపంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.ఈ సందర్భంగా సాయంత్రం సుమారు 600 మంది మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.వేద పండితులు కాసర్ల వంశీ కృష్ణ శర్మ ఆచార్యత్వంలో నారంభట్ల ప్రశాంత్ శర్మ,కసోజ్జుల బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం చతుష్షష్టి పూజలు,సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు.అనంతరం నీరాజనం,మంత్రపుష్పం, నామ సంకీర్తన,దేవీ భాగవత పురాణ ప్రవచనం,తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాల్లో భక్తులు,పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** మండలంలోని బాబాపూర్ గ్రామంలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని చెరువు వద్ద ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయటంతో ట్రాక్టర్లతో మొరం పోయించి పరిసరాలను సిద్ధం చేశామన్నారు. కుల మతాలకతీతంగా ప్రజలు పండగ వేడుకల్లో సౌకర్యాలు కల్పించే దిశగా బాబాపూర్ సర్పంచ్ సమీర్ చేపట్టిన ఏర్పాట్లపై అభినందనలు తెలిపారు. అందరూ కలిసి వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుల మతాలకతీతంగా గ్రామాభివృద్ధి, ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యమివ్వటం అభినందనీయమన్నారు. ఈ ఏర్పాట్లలో ఉపసర్పంచ్ గోవర్ధన్, సంతోష్, కారోబార్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## దుర్గాదేవి మండపంలో మహాచండీహోమం

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఒడ్యాట్ గ్రామంలో శుక్రవారం దుర్గాదేవి మండపం వద్ద మహాచండీ హోమం నిర్వహించారు. ఈ హోమాన్ని కోచగంటి సతీష్ శర్మ పంతులు, గీతమ్మ, మాధురి, శివాని, సాయి వేద పండితుల ఆధ్వర్యంలో జరిగింది. దుర్గాదేవి మండపం వద్ద నిర్వహించిన మహా చండీ హోమంలో అనేక మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సరస్వతి దేవి అలంకరణతో మూల నక్షత్రంలో మహాచండీ హోమం అనంతరం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం జరిపించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవి అలంకరణతో ఉన్న దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ఉరి వేసుకుని ఆత్మహత్య

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్:** కుటుంబ మనస్పర్థల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలోని బాపూజీనగర్ కాలనిలో చోటు చేసుకుంది.



ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. బాపూజీనగర్ కాలనీలో నివాసముంటున్న దావూద్ స్వస్థలం కోరుట్ల మండలానికి చెందిన వారు కాగా గత 15 సంవత్సరాల నుండి భీమ్‌గల్‌లోనే నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. కాగా కోరుట్లలో తన తల్లి, చెల్లెలు కలిసి ఉంటుండగా వారున్న ఇల్లు అమ్మే విషయమై వారి మధ్య మనస్పర్థలు, వివాదాలు తలెత్తాయి. ఈ విషయమై దావుద్ కుమారుడు షేక్ రహీం రెండు రోజుల క్రితం కోరుట్ల వెళ్లి గురువారం సాయంత్రం 6.30 గంటలకు తిరిగి భీమ్‌గల్‌కు వచ్చాడు. రాత్రి నిద్రపోగా శుక్రవారం ఉదయం సుమారు 4 గంటలకు అతని భార్య పని నిమిత్తం బయటకు వెళ్లగా ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఇంట్లో వారి పిల్లలు బయట ఉండగా గది తలుపులు ఎంత పిలిచిన తలుపు తీయలేదు. వెంటనే అతని కూతురు కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా షేక్ రహీం రేకుల పైకప్పుకున్న ఇనుప రాడ్‌కు చున్నీతో ఉరి కనిపించాడు. మృతుని భార్య షేక్ షహీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### మండల అధ్యక్షుడు అజ్మీరా నందు నాయక్



**ప్రజాపక్షం/జన్నారం :** గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కమిటీ సభ్యుడు అంకితభావంతో పనిచేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీరా నందు నాయక్ పిలుపునిచ్చారు. నిర్మల్ డిసిసి అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం జన్నారం మండలంలో కాంగ్రెస్ పార్టీ నూతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను నిరంతరం క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు సొహెల్ షా, పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్, మండల ప్రధాన కార్యదర్శులు మేకల మాణిక్యం, హేమంత్ చారి, ఆడయి హన్మంతరావు, ఉపాధ్యక్షులు కండ్లే చంద్రయ్య, ఆకుల సత్యనారాయణ, కార్యదర్శులు రవి నాయక్, పాపగౌడ్, మల్యా లక్ష్మణ్, జాడి రాజేశ్వర్, పద్మారావు, నాయిని రమేష్ గౌడ్, కమిటీ సభ్యులు అజార్, మర్రిపెల్లి చంద్రయ్య, లకావత్ తిరుపతి, కోడిజుట్టు రాజన్న, చుంచు నర్సయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## సరైన జీవనశైలితో వెన్నునొప్పికి చెక్

### మెడికవర్ న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి




**ప్రజాపక్షం/జగిత్యాల :** మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, కూర్చునే భంగిమలో లోపాలు,సెల్ ఫోన్లు,ఇతర గ్యాడ్జెట్ల మితిమీరిన వినియోగం కారణంగా మెడ,నడుము నొప్పుల సమస్యలు పెరుగుతున్నాయని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి పేర్కొన్నారు. వరల్డ్ స్పైన్ డే సందర్భంగా శుక్రవారం జగిత్యాల ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాక్టర్ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ సరైన జీవనశైలి, క్రమం తప్పని వ్యాయామం, తగిన జాగ్రత్తలతో వెన్నుముక సమస్యలను చాలావరకు నివారించవచ్చని అన్నారు.వయస్సుతో సంబంధం లేకుండా చాలామంది మెడ, నడుము నొప్పులతో బాధపడుతున్నారని, కొన్ని సందర్భాల్లో మెడ భాగంలోని వెన్నుముక నరాలపై ఒత్తిడి పడటంతో తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు.రోజూ వ్యాయామం చేయడం, కూర్చునేటప్పుడు, నిలబడేటప్పుడు సరైన పద్ధతిని పాటించడం, ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోకుండా మధ్యమధ్యలో కదలడం, ఫోన్, ల్యాప్‌టాప్ వినియోగాన్ని పరిమితం చేయడం ద్వారా వెన్నుముక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.వెన్నుముక శస్త్రచికిత్సలంటే భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స జరిగిన రోజే లేదా మరుసటి రోజు డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ వినయ్ కుమార్, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, మనోజ్ కుమార్, మహేష్, పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



**ప్రజాపక్షం/మంచిర్యాల :** అంకెల గారడీతో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల శ్రమను దోచుకుంటోందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మండిపడ్డారు. కార్మికులకు కేవలం 34 శాతం వాటా ప్రకటించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మంచిర్యాల జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను దాచిపెట్టి ప్రభుత్వం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. గతేడాది రూ.2.50 లక్షల బోనస్ ఇస్తే, ఈసారి రూ.1.50 లక్షలకే పరిమితం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని ఏటిఎంలా వాడుకుంటూ బకాయిలు చెల్లించకుండా సంస్థను నష్టపరుస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు అన్యాయం జరుగుతుంటేమెదపకుండా ఢిల్లీలో ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతోనే నైని కోల్ బ్లాక్, పట్టి వెంకట కృష్ణ, కమలాకర్ రావు, ఆకుల అశోక్ వర్ధన్, జయరామ రావు, వైద్య శ్రీధర్, రంగ శ్రీశైలం, కుర్రే చక్రవర్తి, బోయిని దేవేందర్, రామగిరి బనేష్, బూర్ల చిరంజీవి, మహేందర్, తరుణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలతో కాగజ్‌నగర్‌లో పండుగ శోభ



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ సంబరాలు నిర్వహించారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులంతా సమిష్టిగా పాల్గొని ఉత్సాహం నింపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి నిదర్శనమైన బతుకమ్మ ఆటపాటలతో వేడుకల ప్రాంగణం అంతా ప్రత్యేక పండుగ శోభను సంతరించుకుంది. ప్రభుత్వ శాఖల ఉద్యోగినుల భాగస్వామ్యంతో సంబరాలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

## రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపిక

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు 6వ తెలంగాణ రాష్ట్ర పీఆర్‌టీయు కౌన్సిలింగ్ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపికైనట్లు మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజాద్ సుల్తాన్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎస్ఎన్ శ్రీనివాసమూర్తి, వేముల నాగభూషణం, రాధాకిషన్, వర్సల ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు భిక్షంగౌడ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శంకర్, ప్రధాన కార్యదర్శి కిషన్ కృతజ్ఞతలు తెలిపారు.

## దుర్గామాత వద్ద కుంకుమార్చన

**ప్రజాపక్షం/మాక్లూర్ :** దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలూర్ మండలంలోని ఢీకంపల్లి గ్రామంలో దుర్గామాత మండపం వద్ద శుక్రవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని శ్రీనివాస్ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరవ రోజు అమ్మవారు శ్రీ సరస్వతి మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దుర్గామాత మాలధారణ స్వాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలో దుర్గామాత శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీ నర్సింహస్వామి ఆలయంలో శ్రీ సరస్వతి దేవి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సంతాన భాగ్యం, సర్వకార్య జయం కోసం చిన్నపిల్లలను అమ్మవారి ప్రతిరూపంగా కొలుస్తూ ఈ పూజ జరిపినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షులు మల్యాల సుభాష్ గౌడ్, క్యాషీయర్ పన్నాల రవీందర్, పెంట కిషన్, భరత్, సభ్యులు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో సమయపాలన పాటించాలి



**ప్రజాపక్షం/జన్నారం:** వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. శుక్రవారం జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై రోగులకు అందుబాటులో ఉండాలని, సమన్వయంతో పనిచేస్తూ, వ్యాధులు ప్రబలే ప్రాంతాల్లో తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి అవసరమైన మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధులపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తేవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం, దోమకాటు నివారణ చర్యలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలున్న ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ద్రావణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 30 ఏళ్ల పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి, బాధితులకు సకాలంలో మందులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఉమాశ్రీ, పర్యవేక్షకులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణం

### విస్తరణ పనులకు భూసేకరణ వేగవంతం : కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనుల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో భూసేకరణ అంశంపై సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి పనులకు అవసరమైన భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లోని అంశాలను చర్చించారు. భూములు కోల్పోయిన వారికి అందించాల్సిన పరిహారం, ఇప్పటికే పూర్తయిన పరిహారం చెల్లింపులు, మార్కెట్ రేటు, భూమి అప్పగించడంలో జాప్యం జరుగుతున్న చోట అందుకు గల కారణాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారుల నిర్మాణాలు, విస్తరణ పనుల భూసేకరణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. భూసేకరణ విషయంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి జాతీయ రహదారి సంస్థకు భూములు స్వాధీనం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని హితవు పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రేనీ కలెక్టర్ సురేష్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ఒసీ అందజేత

ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామానికి చెందిన మంతెన అఖిల్ అనారోగ్యంతో బాధప డుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సాయం కోసం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి విన్నవించుకోగా చికిత్స కోసం ప్రభుత్వం నుంచి రూ.2లక్షల 20 వేల మంజూరు చేయించి ఎల్ఓసీ పత్రాన్ని వేల్పూర్ గ్రామం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓ సీని శుక్రవారం అందజేశారు. ఈ సంద ర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కల్లెడ ఏలియా, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పాపాయి పవన్, ఆకన్నగారి రవీందర్ పాల్గొన్నారు.

## పత్తి మార్కెట్ యార్డుకు 5 రోజులు సెలవులు

### మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

ప్రజాపక్షం / జమ్మికుంట : అక్టోబర్ 17 శనివారం రోజు నుంచి మార్కెట్ యార్డుకు 5 రోజులు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌ప ర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు. ఆదివారం సద్దుల బతుకమ్మ సాధారణ సెలవు, సోమవారం మహర్నవమి పండుగ సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు, మంగళవారం దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు, 21వ తేది బుధవారం విజయ దశమి పండుగ మరుసటి రోజు సెలవు ప్రకటించినట్లు ఆమె తెలిపారు. కావున శనివారం నుంచి బుధవారం వరకు వరుసగా 5 రోజులపాటు మార్కెట్ యార్డు బంద్ ఉంటుందని తెలిపారు. మార్కెట్ తిరిగి 22 గురువారం రోజున పునః ప్రారంభం కానుం దని కావున రైతులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని ఆమె కోరారు.

### పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర

### ఉపాధ్యక్షులుగా పైడిపెల్లి చంద్రమోహన్

ప్రజాపక్షం / జమ్మికుంట : అక్టోబర్ 15, 16 తేదీలలో నల్లగొండలోని జిఎం గార్డెన్స్‌లో జరిగిన పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర 6వ కౌన్సిల్ సమావేశాలలో జరిగిన ఎన్నికలలో రాష్ట్ర ఉపా ధ్యక్షులుగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంకు చెందిన పైడిపెల్లి చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన పిఆర్‌టియుటిఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గండు కృష్ణమూర్తి ప్రధాన కార్యదర్శి కానుగంటి వెంకటే రెడ్డి, మధు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పలువురు సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు.

## వైభవంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

ప్రజాపక్షం / గన్నేరువరం : మండలంలోని ఖాసీంపేట గ్రామంలో బీసీ సంఘం గ్రామ శాఖ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్స వాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండ పంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వ హిస్తున్నారు. ఈ సందర్భంగా కనకయ్య లచ్చవ్వ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల అధ్యక్షులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

## లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ కె.హరిత



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా అందించే ఉచిత వైద్య సేవ లను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని కలెక్టర్ కె.హరిత కోరారు. శుక్ర వారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఈ సంచార ఆసుపత్రి వైద్య శిబిరాన్ని సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి నవంబర్ 5 వరకు లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్‌లో ఉచిత వైద్య పరీక్షలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజ లకు విస్తృతంగా ప్రచారం కల్పించి సేవలందేలా చర్యలు చేపట్టామ న్నారు. శిబిరంలో కంటి, చెవి, ఎము కలు, పెదవి చీలిక, కాలిన గాయాలు, దంత చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ సేవలు అందుబాటులో ఉంటా యని వివరించారు. ఎమ్మెల్యే హరీష్ బాబు కాగజ్‌నగర్‌లో లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా రెండోసారి సేవలందిస్తు న్నారని, 1991 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 256 ప్రాజెక్టులను ఈ సంస్థ పూర్తి చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఫౌండే షన్ నిర్వాహకులు డాక్టర్ రోహిణి, డాక్టర్ పాల్గొన్నారు.

## రూ.3 కోట్లతో బతుకమ్మ, దుర్గామాత నిమజ్జనాలకు ఏర్పాట్లు



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : సద్దుల బతుకమ్మ, దుర్గామాత నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వ హించుకునేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి నగరంలోని బతుకమ్మ నిమజ్జన పాయింట్లను పరిశీ లించి అధికారులకు పలు సూచనలు చేశారు. లైటింగ్, సౌండ్ సిస్టం, బారికేడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, గజ ఈతగాళ్ల ఏర్పాటు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 21న జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి మానకొం డూర్, కొత్తపల్లి చెరువులను ఎంపికి చేసి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 38 డివిజన్‌లోని అమీర్ నగర్‌లో డిప్యూటీ మేయర్ స్థానిక కార్పొరేటర్ దేవసాని సరస్వతి సత్యనారాయణతో కలిసి రూ.24 లక్షలతో చేప ట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నగరంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని యూఐడీఎఫ్ నిధులతో మౌళిక సదుపా యాలు కల్పిస్తున్నామని అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్ల నిధులు తీసుకొచ్చామని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్య మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, నగరపా లక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐ శ్రీకాంత్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్

### ఎస్సైపై వచ్చిన ఆరోపణలపై డిఎస్‌పి స్థాయి అధికారితో విచారణ

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

### జిల్లా ఎస్‌పి మహేష్ బి. గితే



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ థర్డ్ డిగ్రీ చేసినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎస్సై శ్రీకాంత్‌ను ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కి అటాచ్ చేస్తూ ఈ విషయానికి సంబంధించి విచారణ నిమిత్తం వేములవాడ డీఎస్పీ ని విచారణ అధికారిగా నియమించామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ ని లక్ష్యంగా చేసు కొని అసత్య ప్రచారాలు చేస్తూ ఎక్కం పత్రికలో వరుస కథ నాలు వచ్చిన నేపథ్యంలో పోతిరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లపై గంభీ రావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని అనంతరం వారిని అరెస్ట్ చేసి అక్టో బర్ 13న పోలీస్ స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించి రిమాండ్‌కి తర లించారని గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్‌పై వచ్చిన ఆరోప ణల నేపథ్యంలో విచారణ అధికారిగా వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులును నియమించడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలి పారు. ఈ నేపథ్యంలో ఎస్సై శ్రీకాంత్‌ను తక్షణమే ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని విచారణలో ఏ అధికారి తప్పు చేసినట్లు తేలినా శాఖాపరమై చర్యలు తప్పవని ఎస్పీ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోనే ప్రణాళిక ఏదీ?

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ప్రజాపక్షం / కరీంనగర్ : ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో రైతులను ఆందో ళనకు గురి చేయడం కాకుండా విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళికను వెల్లడిం చాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. యాసంగి పంటలు వేయొద్దని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు చెప్పడం ఏంటని విమర్శిం చారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వ హించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించాలి**

తెలంగాణలో ప్రాణహిత, గోదావరి వంటి నదులు ఉన్నప్ప టికీ సాగునీటి సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయని రవి శంకర్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు అవసరమైన మరమ్మ త్తులు చేపట్టి సాగునీటి వనరులను అందుబాటులోకి తీసు కురావాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినప్పుడు ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటిని అందుబాటులో ఉంచేందుకు ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**కరెంట్ కోతలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు నిరంతర విద్యుత్ అందించామని కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించామని రవి శంకర్ స్పష్టం చేశారు. విద్యుత్ కేంద్రాల నుంచి పూర్తిస్థా యిలో ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని, బొగ్గు సర ఫరా, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రైపొన్నం అనిల్ కుమార్ గౌడ్, శాతవా హన విశ్వవిద్యాలయం బిఆర్ఎస్‌వి ఇంఛార్జి చుక్కా శ్రీని వాస్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు ఉచిత బ్యూటీ అండ్ వెల్‌నెస్ శిక్షణ



ప్రజాపక్షం/మావల: బజార్‌హత్నూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థి నులకు దసరా సెల వుల్లో ఉచిత బ్యూటీ అండ్ వెల్ నెస్ ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులు ప్రారంభమ య్యాయి. దుర్గ సిద్ధి బ్యూటీ సెలూన్ సహకారంతో ప్రిన్సిపాల్ పి శ్రీనివాస్ ప్రసాద్ పర్యవేక్షణలో శిక్షకులు టి. పూజిత, సిహెచ్. శ్యామల ఉపాధి మెళకువలు నేర్పిస్తున్నారు. విద్యార్థినులు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ఎయిర్ పోర్ట్ భూసేకరణపై గ్రామసభ

ప్రజాపక్షం/మావల: ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణలో భాగంగా అనుకుంట గ్రామంలోని రాజ్ మహల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎంఆర్ఓ తదితరులు పాల్గొని రైతుల నుంచి అభ్యంతరాలు స్వీక రించారు. ఎయిర్ పోర్టు కోసం భూములు కోల్పోతున్న రైతులకు తగిన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని రైతు అశోక్‌తో పాటు పలువురు అధికారులను కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## షాపింగ్ మాల్ ప్రారంభించిన నటి నభా నటేష్

ప్రజాపక్షం / జమ్మికుంట : పట్టణ పరిధిలోని కొండూర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ వస్త్ర సిల్క్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ నిర్వాహకులు జక్క రఘునందన్ రెడ్డి అనంత్ రెడ్డి జక్క శమంతకమని, జక్క మనిషాలతో కలిసి శుక్రవారం రోజున సినీ నటి నభా నటేష్ ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్ ఈ ప్రాంత ప్రజలకు అనుగుణంగా నాణ్యమైన తక్కువ ధరలకు దొరికేలా చేస్తున్న యాజమాన్యానికి సినీ నటి నభా నటేష్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నేతలు షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

## బీర్పూర్ మండలంలో కరెంట్ షాక్‌తో మేక మృతి

ప్రజాపక్షం/బీర్పూర్: జగిత్యాల జిల్లా:బీర్పూర్ మండలం లోని తుంగూర్ గ్రామంలో విద్యుత్ ఘాతానికి గురై ఒక మేక మృతి చెందింది. తుంగూర్ గ్రామానికి చెందిన చీకుల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన మేక మేత కోసం వెళ్లిన క్రమంలో, అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచెకు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పో యింది.విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ రాకేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.అలాగే గ్రామ సర్పంచ్ రాజగో పాల్ రావు,ఉప సర్పంచ్ శీలం లింగన్న గౌడ్,వార్డు సభ్యులు సీని యర్ నాయకులు దోసారపు బుచ్చన్న గౌడ్,తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## దుర్గామాతను దర్శించుకున్న జువ్వాడి కృష్ణారావు

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సంద ర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కందుకం గడ్డ మున్నూరు కాపు యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి,మెట్లల్లి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగా ద్యావతి సుదర్శన్ తో పాటు మండలంలోని సర్పంచులు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,మున్నూరు కాపు యూత్ సభ్యులు,కాంగ్రెస్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ పట్టణంలోని గాజులపేటలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి బిజెఎల్పి నేత, నిరమ్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆలయానికి కొబ్బరికాయ కొట్టి శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బిజెపి నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులకు అభినందనలు




**ప్రజాపక్షం/లోకేశ్వరం:** ఆరవ రాష్ట్ర కౌన్సిల్ నల్గొండ జిల్లా జిఎం గార్డెన్‌లో 16.10.2026 శుక్రవారం రోజున జరిగిన సమావేశంలో లోకేశ్వరం మండలం నుండి ఎన్నికైన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి సదానందం,ఏ అశోక్ రెడ్డి,బి సురేష్ రావు, బి చిన్నయ్య,సంజీవ్ రాష్ట్ర ఉపాధ్యక్షలుగా దేవేందర్,రాజేందర్ పి ఆర్ టి యు మండల శాఖ పక్షాన ఎన్నిక అయ్యారు. వారు ఎన్నిక కావడంతో హృదయపూర్వక హార్థిక శుభాకాంక్షలు మా మండలానికి సహకరించిన జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బి వి రమణారావు,తోట నరేంద్రబాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు.

# కాళీకా దేవికీ ఘనంగా అర్చన నీరాజనాలు



**ప్రజాపక్షం/బోథ్:** బోథ్ మండలంలోని కౌఠ బి గ్రామంలో జై భవాని దుర్గ మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించి కాళికా దేవికీ సహస్రనామాలతో ప్రత్యేక అర్చనలువేద పండితులు ధర్మారాజ్ శాస్త్రీవీరశైవ లింగాయత్ అర్చకులు వెండి సోమేశ్వర్ నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల 9 ఆవతారలపై చరిత్రనుభక్తులకుతెలియజేశారు. ఈ పూజ కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్వాములు భక్తులు,మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

# ఎంపి నిధులతో రంగాపేట్ ఒడ్డెర కాలనీలో ఐమాస్ట్ లైట్లు మంజూరు



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** సారంగపూర్ మండలం రంగాపేట్ ఒడ్డెర కాలనీ గ్రామానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ ఎంపి నిధుల ద్వారా ఐమాస్ట్ లైట్లు మంజూరయ్యింది. గ్రామంలో విద్యుత్ వెలుగుల సదుపాయాన్ని మెరుగుపరచడంతో పాటు రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఈ లైట్లు ఉపయోగపడనున్నాయి. ఎంపి నిధుల ద్వారా ఐమాస్ట్ లైట్లు మంజూరు కావడంతో కాలనీ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం ఐమాస్ట్ లైట్ల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి, ఒడ్డెర కాలనీ బూత్ అధ్యక్షుడు దండుగుల వంశీకి అందజేశారు.ఈ సందర్భంగా ఒడ్డెర కాలనీ బూత్ అధ్యక్షుడు దండుగుల వంశీ మాట్లాడుతూ,తమ కాలనీకి ఎంపీ నిధుల ద్వారా ఐమాస్ట్ లైట్లు మంజూరు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నిధులు మంజూరు చేసిన ఎంపి ధర్మపురి అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఐమాస్ట్ లైట్ల ఏర్పాటుతో కాలనీలో రాత్రి వేళల్లో వెలుతురు మెరుగుపడటంతో పాటు ప్రజలకు, వాహనదారులకు సౌకర్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఒడ్డెర కాలనీ బూత్ అధ్యక్షుడు దండుగుల వంశీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిరంజీవి, మల్లేష్, కళ్యాణ్, అంజి, మనోజ్, సిద్ధు,హరికృష్ణ, హరీష్, నవీన్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



### ఎడమల భోజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఎండపల్లి ఉప సర్పంచ్ దాసరి కళ్యాణి కొమురయ్య గృహము ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శంకర్రావుపేట గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు ,ప్రముఖ సామాజిక వేత్త ఎడమల భోజేందర్ రెడ్డి మానవత దృక్పథంతో ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ నెల 12వ తేదీన ప్రమాదవశాత్తు దాసరి కొమురయ్య గృహం పూర్తిగా కాలిపోయిన విషయం తెలుసుకున్న భోజేందర్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లారు. అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించి, సర్వస్వం కోల్పోయిన ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా భోజేందర్ రెడ్డి బాధిత కుటుంబానికి తక్షణ ఉపశమనం కోసం రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.ఆపదలో ఉన్నవారికి తానున్నానంటూ ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకున్న భోజేందర్ రెడ్డికి ఎండపల్లి మాజీ సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

### విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలతో రైతులకు తీవ్ర నష్టం

### డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/ధర్మపురి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, పరిపాలనను గాలికొదిలేసిందని మాజీ డిసి ఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.ధర్మపురిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హయాంలో తెలంగాణ పదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో రాష్ట్రం వెనుకబడుతోందని విమర్శించారు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. గతంలో రైతులకు రెండు పంటలకు రైతుబంధు అందించగా, ప్రస్తుతం రైతులు రెండో పంట సాగుపై ఆందోళన చెందుతున్నారని అన్నారు.గతంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించారని,ప్రస్తుతం రోజుకు 5 నుంచి 6 గంటల విద్యుత్ మాత్రమే సరఫరా అవుతోందని ఆరోపించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతూ రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్‌కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్ నాయకులు సంగి శేఖర్, చిలువేరి శ్యామ్‌సుందర్, చీర్నేని నర్సయ్య,గడ్డం మహిపాల్‌రెడ్డి, అనంతుల లక్ష్మణ్, మొలుగూరి రాజన్న, నక్క రాజేందర్, స్తంభంకాడి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి




**ప్రజాపక్షం/వరంగల్:** కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సిడిపి) పై పునశ్చరణ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. రాజా రెడ్డి మాట్లాడుతూ 2026 అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాల గుర్తింపునకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు తమ శరీరంపై స్పర్శ. ఈ పునశ్చరణ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ, డిఐఒ డాక్టర్ ఐ. ప్రకాష్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, లెప్రసీ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, డిప్యూటీ పారామెడికల్ అధికారి వెంకన్న, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, నోడల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# అలూర్–ధని బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని బిజెఎల్పినేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.గురువారం నిర్మల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.3.60 కోట్లతో అలూర్‌ధని రోడ్డు పనులు ప్రారంభంఅలూర్ గ్రామం నుండి ధని గ్రామం వరకు సిఆర్ఆర్ నిధులు రూ. 3 కోట్ల 60 లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెంగ్వాపేట్‌లో రూ. 20 లక్షలతో హెల్త్ సబ్ సెంటర్అలాగే, నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రా థమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు ఇర్ల చిన్న య్య, సాదవనిత విజయ్, మాజీ సర్పంచ్ గంగన్న,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, సీనియర్ నాయకులు రావుల రామనాథ్, జమాల్, భూమయ్య, రమేష్, తోట భోజన్న, సారంగాపూర్ మండల బిజెపి అధ్యక్షుడు కల్వ నరేష్, నిర్మల్ రూరల్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఇర్ల విజయ్, అశోక్, విడిసి సభ్యులు, పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ప్రభుత్వ అధికారులు మరియు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజుర గ్రామంలో వైభవంగా కుంకుమార్చన



**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలో మహిళలు దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అర్చకులు దేవిదాస్ జోషి మాట్లాడుతూ దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహిళలతో కుమార్చన చేయడం జరిగిందని తెలిపారు. మహిళలు సౌభాగ్యంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని పాడిపంటలు బాగా పండాలని ఈ పూజా కార్యక్రమం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్నదాన సేవలో ఆప్ నాయకుడు సయ్యద్ హైదర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్మల్‌లోని మహాలక్ష్మి వాడలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఎపిపి) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ అన్నదాతగా విరాళం అందించారు.ఈ సందర్భంగా ఆయన స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి సేవల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ మత సామరస్యానికి మన పండుగలే నిదర్శనం.అన్ని మతాల ప్రజలు సోదరభావంతో కలిసికట్టుగా పండుగలు జరుపుకున్నప్పుడే సమాజంలో నిజమైన ఐక్యత, ఆనందం వెల్లివిరుస్తాయి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బైండ్ల శ్రీనివాస్, వసంత రావు,మెరుగు రాజన్న, మాతా దీక్ష స్వీకరించిన గోల్కొండ రాజమణి,రవి,సోషల్ వర్కర్ సాజిద్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.